క్లుప్తంగా

నేడు చర్చావేదిక

పాలకొండ రూరల్: ఎస్సీ వర్గీకరణపై సమాలోచనలు, సలహాల స్వీకరణకు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో గల అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో ఆదివారం ఉదయం పది గంటలకు చర్చావేదిక నిర్వహించనున్నట్లు ఉత్తరాంధ్ర మాల ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ నూతలపాటి భరత్‌భూషణ్‌రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన మాల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఈ కార్యక్రమానికి హాజరై సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

పరామర్శ



మాజీ సర్పంచ్ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస మాజీ సర్పంచ్ రంభ శ్రీనివాసరావు పెద్దమ్మ ఆర్.సన్యాసమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెతో పాటు ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బవిరి సుదర్శనరావు, తదితరులున్నారు.



దాసరిపేటలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని దాసరిపేటకు చెందిన మాజీ సర్పంచ్ కన్నంనాయుడు తల్లి సీతమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు శనివారం ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అక్కడి నుంచి తాళ్లడుమ్మ వెళ్లిన ఆయన.. మండంగి రమేష్ తల్లి చనిపోవడంతో ఆయననూ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సీతంపేటలో వర్షం



మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం

సీతంపేట: మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల్లో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు వర్షం కొంత ఉపశమనాన్ని కలిగించింది. వర్షానికి జీడి, మామిడి పిందెలు రాలిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీతంపేట, కుశిమి, శంబాం, గొయిది, కుడ్డపల్లి, తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది.

భక్తిశ్రద్ధలతో శిలువ యాత్ర



శిలువ యాత్రలో పాల్గొన్న క్రైస్తవ సోదరులు

భామిని: మండలంలోని లివిరిలో క్రైస్తవ భక్తులు శనివారం శిలువ యాత్ర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బత్తిలి ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో విశ్వాసకులు క్రీస్తు శిలువ ధరించి ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో ఫాదర్లు బోగి సంజీవరావు, ప్రతాప్, భామిని సర్పంచ్ లోపింటి రాజేష్ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

నేరడిలో చలివేంద్రం ఏర్పాటు



తాగునీరు అందిస్తున్న సచివాలయ సిబ్బంది

భామిని: మండలంలోని నేరడి-బిలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు గాను చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యదర్శి లోవ అనసూయ, ఏఎన్ఎం నీరజ, మహిళా పోలీస్ భవానీ, ఆశా కార్యకర్త దేవి, తదితరులు తాగునీరు పంపిణీ చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



నాని (ఫైల్)

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినమేరంగి గ్రామానికి చెందిన సిరిపురపు నాని అనే వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు చినమేరంగి ఎస్ఐ అనీష్ శనివారం తెలిపారు. మార్చి 31వ తేదీ నుంచి సదరు వ్యక్తి కనిపించడం లేదని ఆయన భార్య శిరీష ఈ నెల 1వ తేదీన పోలీస్ సూపరింటెండెంట్ మాధవరెడ్డిని కలిసి ఫిర్యాదు చేయగా, ఈ నెల 5వ తేదీన కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నంబర్లు 8977519107, 9515536630లను సంప్రదించాలని కోరారు.

ఐదు మండలాలకు ఒక్కటే శకటం



సమస్యలతో కునారిల్లుతున్న పాలకొండ అగ్నిమాపక కేంద్రం

- సమస్యల నడుమ పాలకొండ అగ్నిమాపక కేంద్రం
- 600 గ్రామాలకు సేవలు అందిస్తున్న ఏకైక కార్యాలయం
- ఏక కాలంలో వేర్వేరు ప్రమాదాలు సంభవిస్తే పరిస్థితి దారుణం



అగ్నిమాపక శకటం నిలిపి ఉంచే షెడ్

పాలకొండ రూరల్:

వేసవి అంటేనే అగ్ని ప్రమాదలకు నెలవు లాంటిది. గతంతో పోల్చుకుంటే ప్రస్తుత వేసవి మరింత ప్రభావం చూపుతోంది. సగటున రోజుకి 40 నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. ఇటాంటి పరిస్థితుల్లో ఎక్కడికక్కడ అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ తరుణంలో ప్రజలకు సేవలందించాల్సిన అగ్నిమాపక శాఖ సిబ్బంది నిత్యం సమస్యలతో సతమతమవుతున్నారు.

నాలుగు దశాబ్దాల కిందట..

డివిజన్ కేంద్రం పాలకొండలో నాలుగు దశాబ్దాల కిందట నిర్మించిన అగ్నిమాపక కేంద్రం పూర్తిగా అవసాన దశకు చేరుకుంది. వాహన సంరక్షణ షెడ్ పూర్తిగా నేలకొరిగింది. దీంతో శకటం ఆరుబయట ఓ రేకుల షెడ్‌లో ఉంచుతున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సైతం తాత్కాలిక గదిలో ఉంటూ సేవలు కొనసాగిస్తున్నారు. ఏ క్షణమైనా ఆ భవనం ఒక్కసారిగా కుప్పకూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. శ్లాబు పెచ్చులూడుతుండడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. భవనం పరిస్థితిని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది.

ఆరు వందల గ్రామాలకు..

ఇదిలా ఉంటే పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో పాలకొండ, వీరఘట్టం, ఏజెన్సీ సీతంపేటతో పాటు శ్రీకాకుళం జిల్లా పరిధి బూర్జ, విజయనగరం జిల్లాకు చెందిన రేగిడి మండలాల పరిధిలో దాదాపు 600 గ్రామాల్లో ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగినా ఇక్కడి అధికారులే పరుగులెట్టాల్సిన పరిస్థితి. ప్రస్తుత సీజన్‌లో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒకే ఒక్క శకటంతో ఇన్ని మండలాల్లో సేవలు అందించడం కష్టతరంగా మారుతోందని సిబ్బంది చెబుతున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

ఇదిలా ఉంటే కేంద్రంలో సరిపడా సిబ్బంది కూడా లేదు. శకటం డ్రైవర్ ఆపరేటర్లు ముగ్గురు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం ఇద్దరితో కాలం వెళ్లదీస్తున్నారు. అగ్నిమాపక కానిస్టేబుళ్లు తొమ్మిది మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం నలుగురితో సరి పెట్టుకుంటున్నారు. దీంతో ఒత్తిడి, పని భారం అధికమవుతోంది. 2010లో 4,500 లీటర్ల సామర్థ్యంతో సమకూరిన వాహనం ప్రస్తుతం పలు సమస్యలతో నెట్టుకొస్తోంది. ఒక మండలం నుంచి వేరొక మండలానికి సుమారు 17 నుంచి 20 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఏక కాలంలో రెండు చోట్ల లేక రెండు మండలాల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పాలకొండ అగ్నిమాక కేంద్రాన్ని పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు. ప్రస్తుత సాంకేతికత, పూర్తి హంగులతో మరో కేంద్రాన్ని సమీప మండలాల్లో ఏర్పాటుచేసే దిశగా చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడుతున్నారు.

భవన నిర్మాణానికి చర్యలు

అగ్నిమాపక కేంద్రానికి కొత్త భవనం నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి భవనం నిర్మించనున్నారు. ఉన్న సిబ్బందితో మెరుగైన సేవలు అందిస్తున్నాం. ప్రమాదాల నివారణపై ఇటీవల విద్యా సంస్థలు, గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాం.

– జామి సర్వేశ్వరరావు, అగ్నిమాపక శాఖాధికారి

దృష్టి సారించాలి..



దీర్ఘకాలంగా పాలకొండ అగ్నిమాపక కేంద్రం సమస్యలతో సతమతవుతోంది. అధికారులు దృష్టి సారించి కొత్త భవనాలు నిర్మించాలి. ఐదు మండలాలకు ఒకే వాహనం ఉండడంతో ఒకే సమయంలో పలు చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవిస్తే నష్టం అధికంగా ఉంటుంది. మరో శకటం మంజూరు చేయడంతో పాటు ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.

– బొత్స గౌరు, విశ్రాంత ఉద్యోగి, చిన మంగళాపురం, పాలకొండ మండలం



అగ్ని ప్రమాదం (ఫైల్)

ఘనంగా స్నాతకోత్సవం



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినమేరంగి కూడలి వద్ద ఉన్న తిరుమలసాయి పాఠశాలలో స్నాతకోత్సవం(కాన్వొకేషన్) శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ ప్రాథమిక విద్య, ప్రాథమిక విద్య పూర్తి చేసిన పలువురు విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. మండల విద్యాశాఖ అధికారి ధనుకొండ గౌరునాయుడు, ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ పార్వతీపురం మన్యం జిల్లా సెక్రటరీ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మొత్తం 130 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలను కరస్పాండెంట్ సరళకుమారి చేతులమీదుగా అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని ఎంఈవో అన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలి

సాలూరు: విద్యుత్ వినియోగదారులపై భారం మోపే స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలని సీపీఎం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్మార్ట్ మీటర్లు మాకొద్దు.. విద్యుత్ ధరలు తగ్గించాలి.. అంటూ రూపొందించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు శంకర్, రాముడు, ఈశ్వరరావు మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ఆరోపించారు. ట్రూఅప్ చార్జీల పేరిట వినియోగదారుల మీద రూ. 17 వేల కోట్ల భారం వేశారన్నారు. వెంటనే విద్యుత్ ధరలు తగ్గించడంతో పాటు స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోలరాజు, శ్రీను, రవి, తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం: సారా తయారు చేసినా, విక్రయించినా, తరలించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని జేకేపాడు గ్రామంలో సారా తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై శనివారం అవగాహన కల్పించారు. సారా తాగితే అధోగతి.. మానితే పురోగతి అని అన్నారు. సారాకు బానిసలైన ఎంతోమంది జీవితాలు నాశనమై, వారి కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. సమావేశంలో పీసా ప్రెసిడెంట్ దేవుళ్లు, వైఎస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల భద్రతకు చర్యలు

పార్వతీపురం రూరల్: ఆలయాలు, ప్రార్థనా మందిరాల భద్రతకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి తెలిపారు. ఈ మేరకు మండలంలోని సంగంవలస, ఎమ్మార్‌నగరం, చినబొండపల్లి, తదితర గ్రామాల్లోని ఆలయాల వద్ద శనివారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అనంతరం సంగంవలసలో ప్రజలతో మాట్లాడుతూ.. ఆలయాల వద్ద ఎలాంటి సంఘటనలకు తావు లేకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నేరాలు జరిగితే నిందితులను సులువుగా గుర్తించవచ్చన్నారు. అలాగే ముఖ్య కూడళ్ల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వ్యాపారులు తమ దుకాణాల వద్ద కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

వెంకటరాజపురంలో ఏనుగుల సంచారం

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం పరిసర పొలాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. సుభద్రమ్మవలస పంటపొలాల నుంచి శనివారం సాయంత్రానికి వెంకటరాజపురం చేరుకున్నాయి. వరి పంట పొట్ట దశలో ఉండడంతో ఏ క్షణాన పంటను నాశనం చేస్తాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, ఏనుగులు తరలించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వివక్షపై తిరుగుబాటు జెండా.. బాబూజీ

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి శనివారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని, జగ్జీవన్‌రామ్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. బాబూజీగా పిలువబడే జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘసంస్కర్త అని, వివక్షపై ఆయనొక తిరుబాటు జెండా అని వక్తలు కొనియాడారు. సామాజిక సమానత్వం, కులరహిత సమాజానికి ఆయన చేసిన కృషి ఆదర్శనీయమన్నారు. ఆయన ఆశయ సాధన దిశగా మనమంతా అడుగులు వేయాలని కోరారు. –పాలకొండ, కురుపాం నెట్‌వర్క్



పాలకొండ రూరల్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జగ్జీవన్‌రామ్ విశిష్టతను వివరిస్తున్న ప్రిన్స్‌పాల్ శ్యాంబాబు



పాలకొండ: నగర పంచాయతీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు



సీతంపేట: ఐటీడీఏలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఐటీడీఏ అధికారులు, సిబ్బంది



వీరఘట్టం : బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జైభీమ్ సంఘ సభ్యులు



గుమ్మలక్ష్మీపురం: తహసీల్దారు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దారు శేఖర్ తదితరులు

ఆక్రమణలు గుర్తిస్తాం..



నరసింహచెరువు ఆయకట్టు స్థితిగతులు తెలుసుకుంటున్న జేఈఈ కార్తీక్

పాలకొండ రూరల్: మండలంలోని పీఆర్.రాజుపేట గ్రామ పరిధిలోగల నరసింహ చెరువు ఆక్రమణలను గుర్తించేందుకు రెవెన్యూశాఖాధికారుల సమన్వంతో తక్షణ చర్యలు చేపడతామని జలవనరుల శాఖ పాలకొండ డివిజన్ జేఈఈ కార్తీక్ అన్నారు. ఇటీవల అదే గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు చేసిన ఫిర్యాదు మేరకు నరసింహ చెరువును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరసింహ చెరువు నుంచి ఓని, పాలకొండ రోడ్డు వరకు గల ఇరిగేషన్ కాలువ కొలతలు సేకరించామన్నారు. ఈ చెరువు దిగువభాగంలో గల పద్మనాభకోనేరు ద్వారా పాలకొండ ప్రాంత రైతులకు సాగునీరు అందించే మదుములు శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జేఈఈ వెంట ఐజీ భుజంగరావు, అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు, తదితరులున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు మన్మధరావు

పాలకొండ రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన క్షేత్ర సహాయకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు అన్నారు. శనివారం స్థానిక ఆంజనేయ ఆలయ ప్రాంగణంలో క్షేత్ర సహాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా తక్కువ జీతానికి పనిచేస్తున్న వీరిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగులకు కనీస వేతనంతో భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, తదితర సదుపాయాలు కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘ జిల్లా నాయకులు ఎం.హరినాథ్, కాద రాము, సాయి తేజ, రాంప్రసాద్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లం విక్రయిస్తే చర్యలు



నల్లబెల్లం విక్రయం నేరమంటూ ఉత్తర్వులు చూపిస్తున్న అధికారులు

సీతంపేట: సారా తయారీకి వినియోగించే నల్లబెల్లం విక్రయిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్‌శాఖ ఏఈఎస్ ఏఎస్ దొర హెచ్చరించారు. ఈ మేరకు మండల కేంద్రంలో బెల్లం వ్యాపారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సారా తయారీకి నల్లబెల్లం విక్రయిస్తే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అవసరమైతే బైండోవర్ కేసులు కూడా పెడతామన్నారు. కార్యక్రమంలో పాలకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.సూర్యకుమారి, పి.మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన ఆలయాలు




శ్రీరామనవమి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. మందిరాలకు కొత్త రంగులు వేయడంతో పాటు భక్తుల దర్శనార్థం ఉత్సవ విగ్రహాలను అలంకరించడం, ఆలయాల ప్రాంగణాల్లో క్యూలైన్‌లో నిలబడే భక్తులకు ఎండ తగలకుండా చలువ పందిళ్లు వేశారు. సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించడంతో పాటు శ్రీరాముని పట్టాభిషేకం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా శ్రీరామనవమి పురస్కరించుకుని, తోటపల్లిలోని శ్రీకోదండరామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం జరుపుతున్నామని, కల్యాణంలో పాల్గొనే దంపతులు రూ.500 చెల్లించి తమ గోత్రనామాలు తెలపాలని అర్చకులు కోరుతున్నారు. –గరుగుబిల్లి

గ్రామాల్లో దాహం కేకలు

- మూలకు చేరిన రక్షిత మంచినీటి పథకాలు
- బావుల నీరే గతి
- పట్టించుకోని అధికారులు



గంగాడ గ్రామం



తుమరాడలో అలంకారప్రాయంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్

బలిజిపేట: మండలంలోని గంగాడ, తుమరాడ, బర్లి గ్రామాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. చాలా రోజుల నుంచి ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొద్దిరోజుల కిందట తుమరాడ, బర్లి గ్రామాల్లో మహిళలు నిరసన ప్రదర్శనలు జరిపినా అధికారులు పట్టనట్లు వ్యవహరించడంపై ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు మండిపడుతున్నారు. గంగాడలోని రక్షిత మంచినీటి పథకం మూలకు చేరి నెల రోజులైంది. దీంతో గ్రామంలో ఉండే బావులు, వీధి బోర్ల నీటినే తాగుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా రక్షిత మంచినీటి పథకం నుంచి తాగునీరు సరఫరా కాకపోయినా ఇంతవరకు అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విడ్డూరం. బోరుబావుల నీరు తాగి రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఉన్న బావికి సమీపంలో ఉన్న వారు మోటార్లు బిగించడంతో కొద్ది నీరు కూడా దొరకడం లేదని వాపోతున్నారు.వేసవి పూర్తిస్థాయిలో రాకముందే తాగునీటి కష్టాలు ప్రారంభమైతే రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటోందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుమరాడ, బర్లిలో కూడా తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తగు చర్యలు చేపడతాం..

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తగు సూచనలు, సలహాలు అందించాం. క్రాస్‌ప్రోగ్రాంలో భాగంగా పాడైన బోరుబావులకు మరమ్మతులు చేయిస్తున్నాం.

– ఏపీఎస్ నగేష్, ఎంపీడీఓ, బలిజిపేట

నేడే రాములోరి కల్యాణం

పార్వతీపురం రూరల్: మండల పరిధిలోని పలు గ్రామాలలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాములోరి కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, కమిటీ పెద్దలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలు, రామమందిరాలు, చలువ పందిళ్లను అందంగా ముస్తాబు చేశారు.